క్లుప్తంగా

ఆర్టీసీ కార్మికుల రిలే దీక్షలు



భీమవరం ఆర్టీసీ డిపో వద్ద రిలే నిరహార దీక్ష చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

భీమవరం(ప్రకాశం చౌక్): కార్మికులపై అధికారుల వైఖరి దారుణంగా ఉందని యూనియన్ జిల్లా కార్యదర్శి వై.వి.రావు, జోనల్ ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావులు విమర్శించారు. గ్యారేజీ మెకానిక్ సస్పెన్షన్‌ను ఖండిస్తూ డిపో ఎదుట శుక్రవారం రెండో రోజు రిలే నిరాహార దీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బాధ్యులైన అధికారులను వదిలేసి సర్క్యులర్ విరుద్ధంగా యువీ రావును సస్పెండ్ చేశారన్నారు.ఆయనను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు జోనల్ మెంబర్ లలితా, రాష్ట్ర యూనియన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

సూర్య ఘర్ యోజనపై అవగాహన సదస్సు

భీమవరం(ప్రకాశంచౌక్): ప్రధాన మంత్రి సూర్య ఘర్ పథకం కింద జిల్లాలో ఎక్కువ మంది గృహ విద్యుత్ వినియోగదారులు ఈ పథకాన్ని వినియోగించుకొని లబ్ది పొందేలా వినియోగదారులను ప్రోత్సహించాలని జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సూర్య ఘర్ యోజనపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ పథకం వివరాలు తెలిపేలా గ్రామాల వారీగా అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. బ్యాంకర్లు, పంచాయతి సెక్రటరీలు, విద్యుత్ శాఖ సిబ్బంది, విఆర్వోలు తప్పనిసరిగా హాజరై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సోలార్ రూఫ్ టాప్ కనెక్షన్ పెట్టుకోదలచిన ఔత్సాహిక వినియోగదారులు విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్లు (ఏ.ఇ.లు) ను సంప్రదించాలని జేసీ కోరారు. గ్రామాల్లో నిర్వహించే ప్రధాన్ మంత్రి సూర్య ఘర్ అవగాహన గ్రామ సదస్సులు వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకంపై ఎటువంటి సందేహాలు ఉన్న జిల్లా స్థాయి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కాల్ సెంటర్ నెంబర్ 9490610152కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది శ్రీ ఏ.రఘునాథ్‌బాబు, పర్యవేక్షక ఇంజినీర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు, రెవెన్యూ సిబ్బంది, ఆర్డీవోలు, మునిసిపల్ కమీషనర్లు, ఎల్‌డీఎం, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

మదర్ నెస్ ఆస్పత్రిలో వైద్యసేవలు ప్రారంభం



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజు, చిత్రంలో కేంద్ర మంత్రి వర్మ, మంత్రి నారాయణ తదితరులు

భీమవరం(ప్రకాశం చౌక్) : భీమవరం జేపీ రోడ్డులో నూతన మదర్ నెస్ ఆస్పత్రిని మండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు, కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రి నారాయణ శుక్రవారం ప్రారంభించారు. సామాన్యులకు సైతం కార్పొరేట్ వైద్యం అందించేలా నూతన టెక్నాలజీతో ఆసుపత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయమని వక్తలు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, ఎమ్మెల్యే అంజిబాబు, మదర్ నెస్ ఫౌండర్ డైరెక్టర్, చిన్నపిల్లల సీనియర్ వైద్య నిపుణుడు డాక్టర్ వి.వంశీ శివరామరాజు, గైనకాలజిస్ట్ డాక్టర్ కె.మానస శ్రావ్య పాల్గొన్నారు.

నులిపురుగులతో ఆరోగ్యానికి చేటు



పాలకొల్లులో పోస్టర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: కడుపులో నులిపురుగుల వల్ల తరచూ అనారోగ్య సమస్యలు ఏర్పడతాయని మెడికల్ ఆఫీసర్ అడ్డాల ప్రతాప్‌కుమార్ అన్నారు. పాలకొల్లు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈ నెల 10న నిర్వహించే జాతీయ నులిపురుగు నివారణ సంబంధిత పోస్టర్‌ను ఎంపీడీఓ ఎస్ఎస్ ఉమామహేశ్వరరావు శుక్రవారం విడుదల చేశారు. లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ఐదేళ్ల లోపు చిన్నారులు 1182 మంది, ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలల్లో 4,334 మంది పిల్లలకు నులిపురుగు నివారణ మాత్రలు అందించనున్నట్లు చెప్పారు. ఎంఈఓ జి వీరాస్వామి, ఈఓపీఆర్‌డీ తాళ్ల మూర్తిబాబు, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, రూరల్ పంచాయతీ కార్యదర్శి సీహెచ్ సత్తిబాబు, కార్యాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

చెత్త కుప్పలు.. ముప్పతిప్పలు

- మచ్చుకైనా కానరాని 'స్వచ్ఛభారత్'
- పట్టణంలో అధ్వానంగా పారిశుధ్యం
- రోడ్ల వెంబడి పేరుకుపోతున్న చెత్త
- పట్టించుకోని అధికారులు

స్వచ్ఛభారత్ లక్ష్యం నెరవేరడం లేదు. చెత్త రహిత పట్టణంగా తీర్చిదిద్దాలనే సంకల్పానికి అధికారులు తిలోదకాలిస్తున్నారు. నిర్వహణ కొరవడి పట్టణంలో రోడ్ల వెంబడి చెత్త పేరుకుపోతోంది. ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోంది. పారిశుధ్య నిర్వహణ చేపట్టాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు.

భీమవరం(ప్రకాశం చౌక్): సీజనల్ వ్యాధులు ప్రబలే సమయంలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాల్సిన మున్సిపల్ అధికారులు చేతులెత్తేశారు. అధికారులు పారిశుధ్యం మెరుగుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నా.. అది మాటలకే పరిమితమవుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పట్టణంలో ఎక్కడ చూసిన చెత్త దిబ్బలు కనిపిస్తున్నాయి. దోమలు వృద్ధి చెందడంతో పాటు పందులు, కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. పట్టణం..పల్లెలకు వచ్చే వారికి చెత్త స్వాగతం పలుకుతోంది. రోడ్ల పక్కన నిలుచునే పరిస్థితి లేని తీరు కలవరపెడుతోంది. భీమవరం పట్టణంలోని పలు వార్డుల్లో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. ముఖ్యంగా భీమవరం పట్టణంలోని బలుసుమూడి, బీసీ కాలనీ ప్రాంతాలల్లో అపారిశుద్ధ్యం నెలకొంది. బలుసుమూడు, బీసీకాలనీలో చెత్తచెదారాన్ని రెండుమూడు రోజులకు ఒక్కసారి తీస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ రెండు వార్డులు చెత్త నిలయాలుగా మారాయి. దోమలు విజృంభించి వ్యాధులు బారిన పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రహదారులను శుభ్రం చేయించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



భీమవరం బలుసుమూడిలో రోడ్డు పక్కన పేరుకున్న ఉన్న చెత్తా చెదారం

స్వచ్ఛ సంకల్పానికి తిలోదకాలు

స్వచ్ఛభారత్ లక్ష్యం నెరవేరడం లేదు. ఇప్పుడు కొత్తగా స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ పేరుతో చేపట్టే పారిశుధ్య, కార్యక్రమాలు సైతం ఎక్కడా జరగడం లేదు. చెత్త రహిత వార్డులు, గ్రామాలుగా తీర్చిదిద్దాలనే సంకల్పానికి అధికారులు తిలోదకాలిస్తున్నారు. నిర్వహణ కొరవడి పట్టణం, గ్రామాల్లో రోడ్ల వెంబడి చెత్త పేరుకుపోతుంది. ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటుంది. పారిశుధ్య పనులు చేపట్టాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రజలు దుర్వాసనతో సావాసం చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పట్టణంలో పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. భీమవరం నియోజకవర్గంలో పట్టణంలోని, మండలాల్లోని గ్రామాల్లో వీధులు డ్రెయినేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగింపుపై అధికారులు ఏమాత్రం దృష్టి పెట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా చెత్త గుట్టలు గుట్టలుగా పేరుకుపోవడంతో దోమలు, ఈగలు లార్వాల సంతతికి నెలవుగా మారింది.



బలుసుమూడిలో రోడ్డుపైనే చెత్త వేసిన దృశ్యం



బీసీ కాలనీలో మెయిన్ రోడ్డులో అపారిశుద్ధ్యం



శ్రీరామపురం కాలభైరవ ఆలయం వద్ద ఖాళీ స్థలంలో చెత్తాచెదారం

అగ్నికుల క్షత్రియులు ఐక్యత కోసం పాటుపడాలి



లోసరిలో గజమాల యాత్రలో మాట్లాడుతున్న మిస్ ఆసియా భావనరెడ్డి

భీమవరం అర్బన్: ప్రతి ఒక్కరూ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడాలని మిస్ ఆసియా భావనరెడ్డి తెలిపారు. కొపనాతి కృష్ణమ్మ మహా గజమాల యాత్రను మండలంలోని లోసరి గ్రామంలో మిస్ ఆసియా భావనరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ యాత్రను ప్రారంభించిన అనంతరం భావనరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉన్నత విద్యనభ్యసించాలన్నారు. ఈ గజమాలకు యాత్రకు భారీ సంఖ్యలో అగ్నికుల క్షత్రియులు పాల్గొనడం అభినందనీయమన్నారు. అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవానికి హాజరయ్యేందుకు నిర్వహిస్తున్న ఈ మహా గజమాల యాత్రగా కృష్ణా జిల్లాలోని లక్ష్మీపురం నుంచి అగ్నికుల క్షత్రియులు తరలివెళ్లడం ఆనవాయితీగా వస్తోందని ఈ సందర్భంగా ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, పల్లవసేన రాష్ట్ర అధ్యక్షుడు కొల్లాటి బాబురావు, పల్లవసేన అధికార ప్రతినిధి కొల్లాటి రాజ్‌కుమార్ వర్మ, గజమాల యాత్ర కన్వీనర్ కొల్లు సుబ్బు, గోపి కృష్ణారెడ్డి, అంద్రాజు శ్రీను, వరదరాజు, నాగిడి రాంబాబు, అగ్నికుల క్షత్రియులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవులు పొందినవారికి అభినందనలు



ఉండిలో నామినేటెడ్ పదవులు పొందిన నాయకులను అభినందిస్తున్న పీవీఎల్, మండలాధ్యక్షుడు ఆంజనేయరాజు

ఉండి: మండలంలో నామినేటెడ్ పదవులు పొందిన నాయకులను శుక్రవారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీఎల్ నర్సింహరాజు అభినందించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో మండలంలో నామినేటెడ్ పదవులు పొందిన నాయకులు పార్టీ మండలాధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు ఆధ్వర్యంలో పీవీఎల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలో నామినేటెడ్ పదవులు పొందినవారిలో నియోజకవర్గ ఇంటిలిజెన్స్ ఫోరం అధ్యక్షుడు గోగులమండ చినకృష్ణమూర్తి, వాణిజ్య విభాగ అధ్యక్షుడు శేషాద్రి శ్రీనివాస్, స్టూడెంట్ వింగ్ అధ్యక్షుడు మన్నే మల్లిఖార్జున పవన్‌కుమార్, మహిళాధ్యక్షురాలు బందెల ప్రమీల, ఎస్టీసెల్ అధ్యక్షుడు బొడ్డు రామకృష్ణ ఉన్నారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నమ్మకాన్ని వమ్ముకానీయకుండా నామినేటెడ్ పదవులు పొందినవారంతా ప్రజాపక్షాన నిలబడాలని పేర్కొన్నారు. పదవులు మనకు అలంకార ప్రాయంగా భావించకుండా అవి మనకు ఓ భాధ్యతగా భావించి ప్రజలకు మంచి జరిగేలా నిరంతరం కృషి చేయాలని తెలిపారు. గత ఎన్నికల్లో అధికారం కోసం నోటికొచ్చిన వాగ్దానాలు చేసిన కూటమి నాయకులు ఇప్పుడు చేతులెత్తేసారని అన్నారు. నియోజకవర్గ ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలు కూడా మోసపోయారని ప్రజలను మోసగించిన వారికి వ్యతిరేకంగా ప్రజాపక్షంగా మనమంతా పోరాటం చేసి ప్రజలకు మంచి జరిగేలా చూడాలని పీవీఎల్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గలావిల్లి ధనుంజయ తదితరులు పాల్గొని నామినేటెడ్ పదవులు పొందిన వారిని అభినందించారు.

నేటి నుంచి సత్తెమ్మ తల్లి జాతర మహోత్సవాలు



సత్తెమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న జాతర కమిటీ సభ్యులు

ఉండి: మండలంలోని పెదపుల్లేరులో సత్తెమ్మ అమ్మవారి 60వ వార్షిక జాతర మహోత్సవాలు 8వ తేదీ శనివారం నుంచి 16వ తేదీ సోమవారం వరకు నిర్వహిస్తున్నట్లు కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు శుక్రవారం తెలిపారు. పెదపుల్లేరులో నిర్వహించిన సమావేశంలో నిర్వహకులు జాతర వివరాలను తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ అమ్మవారి 60వ వార్షిక జాతర మహోత్సవాలు కావడంతో చాలా ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రారంభ కార్యక్రమం శనివారం ఉదయం 8:45గంటలకు కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలతో వైభవంగా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. జాతర కొరకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.ఈ జాతర ఉత్సవాల్లో భాగంగా 9వ తేదీ ఆదివారం 108 కలశాలతో పంచామృతాలతో అభిషేకాలు, గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతీరోజు భజన, సాయంత్రం పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 17వ తేదీ సోమవారం ఉదయం 1గంట నుంచి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో అఖండ అన్నసమారాధనా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు సత్తెమ్మ అమ్మవారి దేవస్థానం, జాతర కమిటీ పెద్దలు తెలిపారు.

రహదారి నిబంధనలు పాటించండి



భీమవరం భారతీయ విద్యాభవన్స్ స్కూల్లో రహదారి భద్రతపై మాట్లాడుతున్న రమణ

భీమవరం: ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనలు పాటించాలని మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ సీహెచ్‌వీ రమణ తెలిపారు. భీమవరం భారతీయ విద్యాభవన్ స్కూల్‌లో 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం విద్యార్థులు, స్కూల్ బస్సు డ్రైవర్లకు రహదారి భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీహెచ్‌వీ రమణ మాట్లాడుతూ విద్యార్థులు 18 ఏళ్లు నిండకుండా మోటార్ వాహనాలు నడిపితే వారితోపాటు తల్లిదండ్రులు కూడా శిక్షార్హులు అవుతారని హెచ్చరించారు. కారులో ప్రయాణించేటపుడు తప్పనిసరిగా సీట్ బెల్ట్ వినియోగించాలన్నారు. స్కూల్ బస్ డ్రైవర్లు వాహనం నడిపేటప్పుడు సెల్‌ఫోన్ మాట్లాడవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, డాక్టర్ హనుమ లక్ష్మి, స్కూల్ ప్రిన్సిపల్ టీజే దేవీపద్మ, ఏవో యుఆర్‌కె రవిరాజు, ఎన్‌సీసీ ఆఫీసర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట

వైఎస్సార్‌సీపీ మునిసిపల్ వింగ్ జిల్లా అధ్యక్షుడు పేరిచర్ల



భీమవరంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణరాజు

భీమవరం: సూపర్‌సిక్స్ అంటూ ఎన్నికల్లో పెద్ద ఎత్తున ప్రచారం చేసి అధికారంలోనికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజలను మరోసారి ఘూరంగా మోసం చేశారని వైఎస్సార్ సీపీ మునిసిపల్ వింగ్ జిల్లా అధ్యక్షుడు పేరిచర్ల సత్యనారాయణ రాజు విమర్శించారు. భీమవరంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సంపద సృష్టించడం తెలియదని చెప్పి, అధికారంలోకి వచ్చి ఏడునెలల కాలంలో కూటమి ప్రభుత్వం సృష్టించిన సంపద ఎంతో ప్రజలకు చెప్పాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా రూ. 16 వేల కోట్ల విద్యుత్ భారాన్ని ప్రజలపై మోపారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం లక్షల కోట్లు అప్పులు చేస్తున్నా పేదలకు ఉపయోగపడే ఒక్క సంక్షేమ కార్యక్రమానికి అమలు చేయలేకపోయారని, అప్పులతో రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసాన్ని సృష్టిస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి కారణమైన ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ప్రజలకిచ్చిన హామీల అమలుకు ఆయనే చర్యలు తీసుకోవాలని సత్యనారాయణరాజు డిమాండ్ చేశారు. ముందుగా తనకు జిల్లా మున్సిపల్ వింగ్ అధ్యక్ష పదవి ఇచ్చినందుకు పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు రుద్రాక్షల శ్రీనివాస్, ఎంబీడిఎస్ భాష, వెలుదుర్తి గోపాలకృష్ణ, కొండల ప్రసాద్ పాల్గొన్నారు.

నేటి నుంచి పెనూయేలు సువార్త సభలు



పాస్టర్ ఈదా విజయప్రసాద్

ఉండి: ప్రతీయేటా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఉండి పెనూయేలు ప్రెయర్ మినిస్ట్రీస్ 20వ వార్షికోత్సవ క్రీస్తు సువార్త మహాసభలు ఈ నెల 8వ తేదీ శనివారం నుంచి 10వ తేదీ సోమవారం వరకు ప్రతీరోజు సాయంత్రం 6:30 గంటల ఉండి బస్టాండ్ ఎదురుగా ఉన్న ఎస్టీఆర్ ఎస్టేట్స్‌లో నిర్వహిస్తున్నట్లు పాస్టర్ ఈదా విజయప్రసాద్ శుక్రవారం తెలిపారు.ఈ సభలకు పాస్టర్ జఫన్యాశాస్త్రి (విశాఖపట్నం), బ్రదర్ మాథ్యూస్(గుంటూర్), పాస్టర్ జార్జ్‌బుష్ (ఉయ్యూరు) ప్రసంగీకులుగా హాజరవుతున్నారని తెలిపారు. అలాగే ముఖ్య అతిధిగా రాష్ట్ర పాస్టర్స్ సోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి బ్రదర్ జాన్సన్ మేడిద(భీమవరం) విచ్చేస్తున్నారన్నారు. ప్రముఖ క్రైస్తవ సంగీత దర్శకులు జోనా టీమ్(నర్సాపురం) అద్భుత సంగీతంతో క్రీస్తు ఆరాధనా గీతాలు వినిపిస్తారని తెలిపారు. ఈ సభలకు హాజరైన వారందరికీ ప్రత్యేక ప్రార్థనలు చేస్తారన్నారు. దేవుని బిడ్డలందరూ తప్పకుండా ఈ మహాసభలకు తరలి రావాలని సునీత కోరారు.

ఘనంగా అభయాంజనేయుని విగ్రహ ప్రతిష్ఠ



32 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహావిష్కరణలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్.నర్సింహరాజు



అన్నసమారాధన ప్రారంభించిన నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి

ఆకివీడు: అపారమైన శక్తి సామర్థ్యాలు కలిగిన హనుమంతుడి ఆశీస్సులు ప్రజలందరికీ కలగాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీఎల్.నర్సింహరాజు ప్రార్థించారు. స్థానిక రైల్వే స్టేషన్ వద్ద తీగలదొడ్డి ప్రాంతంలో 32 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహావిష్కరణ కార్యక్రమం జై శ్రీరామ్, జై హనుమాన్ నినాదాల మధ్య శుక్రవారం వైభవోపేతంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో సీతారాములోరి విగ్రహం, పెద్దింటి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠలు జరిగాయి. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ అభయాంజనేయ స్వామి ఆలయ నిర్మాణం అద్భుతంగా ఉందని చెప్పారు. నిర్మాణం చేపట్టిన వార్డు కౌన్సిలర్ గేదల అప్పారావును అభినందించారు. అనంతరం ఆలయ మర్యాదలతో పీవీఎల్‌ను అప్పారావు సత్కరించారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది. అన్న సమారాధన కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి పాల్గొన్నారు. ఐదు వేల మందికి పైగా అన్నసమారాధనలో పాల్గొని ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్ల రామకృష్ణారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ మోటుపల్లి గంగాధరరావు, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు అంబటి రమేష్, నగర పంచాయతీ విప్ పడాల శ్రీనివాసరెడ్డి, వైస్‌చైర్మన్ పుప్పాల పండు, కౌన్సిలర్లు దొడ్డి జగదీష్, కోఆప్షన్ సభ్యురాలు మన్నే లలితాదేవి, మన్నే పోతరాజు, జామి శ్రీనివాస్, మంతెన సునిల్‌కుమార్, ఊడిగ శ్రీనివాస్, కేశిరెడ్డి దిలీప్, కూటమి నాయకులు మోటుపల్లి ప్రసాద్, గంధం ఉమ, కిమిడి నాగరాజు, సప్పా మణికంఠ పాల్గొన్నారు.

రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

యలమంచిలి: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులంతా అగ్రి స్టాక్ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యవసాయాధికారి చిండులూరి దేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులంతా రైతు సేవా కేంద్ర ఇన్‌చార్జి ద్వారా నమోదు చేసుకోవాలని ఆమె కోరారు.

స్టెమీతో హృదయ రక్ష



ఆకివీడు సీహెచ్‌సీ ప్రభుత్వ ఆసుపత్రిలో టెనీక్లిప్ టేస్ ఇంజక్షన్‌ను ప్రారంభించిన దృశ్యం

ఆకివీడు: గుండెపోటు వచ్చిన వెంటనే చికిత్స అందించే లోపే ప్రాణాల్ని కాపాడేందుకు స్టెమీ ఇంజక్షన్ స్థానిక సీహెచ్‌సీలో అందుబాటులో ఉందని ఆసుపత్రి సూపరింటెండెంట్ గణేష్ చెప్పారు. స్థానిక సీహెచ్‌సీలో శుక్రవారం స్టెమీ ఇంజక్షన్ ఇచ్చే తీరును ప్రయోగాత్మకంగా ఆయన వివరించి, ప్రారంభించారు. గణేష్ మాట్లాడుతూ కార్పొరేట్ ఆసుపత్రుల్లో రూ. 45 వేల రూపాయలతో ఈ ఇంక్షన్‌ను గుండెపోటు వచ్చిన వారికి ప్రథమ చికిత్సగా చేస్తారని చెప్పారు. దీనిని ఉచితంగా సీహెచ్‌సీలో చేసేందుకు ప్రప్రథమంగా రెండు ఇంజక్షన్లకు సరిపడే మందును ప్రభుత్వం సరఫరా చేసిందని చెప్పారు. ఎవరికైనా ఎడమ ఛాతి నొప్పి, ఆయాసం, గుండె దడ, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలుంటే గుండె పోటుగా భావించి, వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి చేరాలని సూచించారు. అటువంటి వారికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా ఇంజక్షన్ చేస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యులు భువన, ఎండీ.నజిరిన్, రాజేష్, చైతన్య, రాజశేఖర్, సునంద, వెంకటపతిరాజు, సీహెచ్‌ఓ ప్రసాద్, టెక్నీషియన్ విజయ్ పాల్గొన్నారు.

రోగులకు మందుల పంపిణీ

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు పరిసర గ్రామాలకు చెందిన పలువురు రోగులకు వాకర్స్ క్లబ్ తరఫున రూ.15 వేలు విలువైన మందులను పంపిణీ చేశారు. శుక్రవారం పాలకొల్లు వాకర్స్‌క్లబ్ కార్యాలయంలో క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు చేతుల మీదుగా పాలకొల్లు, కాపవరం, పోడూరు మండలం జగన్నాథపురానికి చెందిన రోగులకు మందులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్‌సాహెబ్, ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి కృషి

భీమవరం: అభివృద్ధికి రోల్‌మోడల్‌గా జిల్లాను తీర్చిదిద్దేందుకు కృషి చేయనున్నట్టు కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలిపారు. భీమవరంలో శుక్రవారం నిర్వహించిన బీజేపీ జిల్లా పదాధికారులు, నూతన మండలాధ్యక్షుల సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో జిల్లాలోని ప్రతి మండలంలో తాను పర్యటిస్తానని ఈ సందర్భంగా చెప్పారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. పాల్గొన్నారు.

గర్భిణుల రిజిస్ట్రేషన్ తప్పనిసరి

పాలకొల్లు అర్బన్: గర్భిణుల వివరాలను అంగన్‌వాడీ వర్కర్లు రిజిస్ట్రేషన్ చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పులఖండం సత్యవేణి అన్నారు. పాలకొల్లు మండలం పూలపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్ ఇందిర ఆదేశాల మేరకు గ్రామ ఆరోగ్య పోషణ దినోత్సవం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. బాల సంజీవిని కిట్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.